
బాధితుల పక్షాన రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

న్యూమారుతినగర్ నార్త్ కాలనీలో రోదిస్తున్న మహిళలు

ఇంటి డాక్యుమెంట్లను చూపుతున్న న్యూమారుతినగర్ నార్త్ కాలనీవాసులు

చావనైనా చస్తాం..ఖాళీ చేయం..

హైడ్రా గోబ్యాక్.. సీఎం డౌన్ డౌన్..!

- తిరగబడ్డ మూసీ నిర్వాసితులు
- మార్కింగ్‌కు వచ్చిన అధికారుల అడ్డగింత
- ఓ బాధితుడి ఆత్మహత్యాయత్నం..ఉద్రిక్తత
- సీఎం రేవంత్‌కు వ్యతిరేకంగా నినాదాలు
- బాధితులను పరామర్శించిన ఎంపీ ఈటల

మన్సూరాబాద్, సెప్టెంబర్ 27: ఉప్పల్ మండల రెవెన్యూ పరిధి చైతన్యపురి, కొత్తపేట డివిజన్ల పరిధిలోని భవానీనగర్, వినాయక్‌నగర్, ఫణిగిరికాలనీ, సత్యానగర్, న్యూమారుతినగర్ నార్త్ కాలనీల్లోని 225 ఇండ్లు మూసీ రివర్ బెడ్ ఏరియాలో ఉన్నట్లుగా ఇటీవల అధికారులు గుర్తించారు. సదరు ఇండ్లపైన ఆర్‌బీఎక్స్ అని మార్క్ చేసేందుకు శుక్రవారం ఉదయం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన రెవెన్యూ అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య పైన తెలిపిన ప్రాంతాలకు చేరుకున్నారు. మూసీ రివర్ బెడ్ ఏరియాలో ఉన్న ఇండ్లపై మార్కింగ్ చేసేందుకు వచ్చిన అధికారులపై ప్రజలు ఒక్కసారిగా తిరగబడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ ఇండ్లు పోతాయేమోనన్న బాధతో ప్రజలు రోధించారు. పాపాత్ముడికి పట్టం కట్టినందుకు తమకు తగిన శాస్తి జరిగిందంటూ మహిళలు కంట నీరు పెట్టుకున్నారు. ప్రజల నిరసల మధ్యనే 225 ఇండ్లకు గాను గురు, శుక్రవారాల్లో రెండు రోజుల్లో 161 ఇండ్లకు మార్కింగ్ వేశారు.

హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి చేస్తున్న డ్రామా ప్రజలు గమనిస్తున్నారు: ఎంపీ ఈటల రాజేందర్

ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మూసీ పరీవాహక ప్రాంతాలైన చైతన్యపురి, కొత్తపేట డివిజన్లలో ఆయన పర్యటించి ప్రజలతో మాట్లాడారు. అనంతరం న్యూమారుతినగర్ నార్త్ కాలనీలో ప్రజలతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. కలెక్టర్, ఆర్డీఓ వచ్చి సమాదానం చెప్పే వరకు ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని మూసీ పరీవాహక ప్రాంత కాలనీల్లోనే ఉంటానని భీష్మించుకుకూర్చున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అక్కడికి చేరుకున్న ఎంపీ ఈటల రాజేందర్ రాత్రి 6:30 గంటల వరకు అక్కడే ఉన్నాడు. రాత్రికి ప్రజలతో కలిసి అదే ప్రాంతంలో ఉంటానని తెలిపాడు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. హైడ్రా పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న డ్రామాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. పేదల కడుపుకొట్టే దుర్మార్గమైన చర్యలకు ప్రభుత్వం దిగిపోయిందని.. పేదల జీవితాలతో ఆడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం కాలగర్భంలో కలిసి పోతుందని హెచ్చరించారు. దొంగల్లా వచ్చి శని, ఆదివారాల్లో ఇండ్లు కూలగొడతామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. లక్షల మందితో రేవంత్‌రెడ్డి ఇంటిని చుట్టుముడుతామని అన్నారు. ప్రజల కన్నీళ్లు, గోసలు పట్టించుకోకుండా వేదింపులకు గురి చేస్తున్న అధికారులు జైళ్లకు వెళతారని.. ఒక్కసారి గతంలో జరిగిన సంఘటనలను అధికారులు గుర్తుకు తెచ్చుకోవాలని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు బిక్షపెడితే ముఖ్యమంత్రి పదవి వచ్చిందన్న విషయాన్ని రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయిందని తెలిపారు. హెల్త్ డిపార్ట్‌మెంట్లు, జీహెచ్‌ంఎసీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి డ్రామాలకు తెరలేపాడన్నారు.

మార్కింగ్ చేయడం ఆపకుంటే చస్తానంటూ పెట్రోల్ పోసుకున్న బాధితుడు

మార్కింగ్ చేసేందుకు వచ్చిన అధికారులకు న్యూమారుతినగర్ నార్త్ కాలనీలో తీవ్ర ప్రతిఘటన ఎదురయ్యింది. నా ఇల్లు పోతే ఇక నేను చావడమే శరణ్యం.. నేను బ్రతికి ఇక లాభం లేదంటూ మహేశ్ అనే వ్యక్తి రోదిస్తూ రోడ్డుపైకి వచ్చాడు. 20 సంవత్సరాలుగా ఉంటున్న నా ఇంటిని కూల్చితే నేను నాకుటుంబం.. నా చెల్లెండ్లు రోడ్డున పడతామంటూ ఏడుస్తూ పెట్రోల్‌ను మీద పోసుకున్నాడు. పూల వ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటుంటే ఉన్న ఇల్లు కూలగొడితే ఎట్లా బ్రతికేదంటూ నిప్పంటించుకునేందుకు ప్రయత్నం చేశాడు. విషయాన్ని గమనించిన స్థానికులు మహేశ్ ఒంటిపై నీళ్లు పోసి సముదాయించారు. ప్రభుత్వం ఇచ్చే డబుల్ బెడ్‌రూమ్ అవసరం లేదని.. బతుకైనా, చావనై ఇక్కడే ఉంటామంటూ అతడు విలపించారు. ఇదిలా కొనసాగుతుండగానే కొద్ది దూరంలోనే మరో మహిళ స్పృహ తప్పి పడిపోయింది. మమ్మల్ని రోడ్ల పాలు చేసేందుకే ప్రభుత్వం కంకణం కట్టుకుందా అంటూ బోరున విలపిస్తూ నడి రోడ్డుపై పడింది.

ఎట్టి పరిస్థితుల్లోను మార్కింగ్ చేయనివ్వమని భీష్మించుకు కూర్చున్న ప్రజలు

మూసీ రివర్ బెడ్ ఏరియాగా గుర్తించిన ప్రదేశాల్లో ఏనాడు ఒక్క ఇల్లు నీట మునిగిన దాఖలాలు లేవన్నారు. మూసీ పరీవాహక ప్రాంతానికి సుమారు 100 మీటర్ల ఎత్తులో ఉన్న ఇండ్లను ఖాళీ చేయాలనడం ఎంత వరకు సమంజసమని ప్రజలు ప్రశ్నించారు. తాము నిర్మించుకున్న ఇండ్ల ఎత్తుకు మూసీ నది నీరు చేరుకున్నట్లయితే దిగువన ఏ గ్రామం మిగలదని.. తమ ఇండ్లను కూల్చి రియల్ ఎస్టేట్ దందా చేసేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నాడని ప్రజలు ఆరోపించారు. పేదల ఇండ్లు కూల్చి అందమైన భవనాలు నిర్మించి ఆస్తులు కూడగట్టుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నట్లు కనపడుతుందన్నారు. ప్రజాపాలన అంటూ అధికారంలోకి వచ్చి ప్రజల నడ్డి విడిచే విధంగా వ్యవహరిస్తున్నారని.. తమ ఉసురు తగిలి ఈ ప్రభుత్వం కూలిపోతుందని శాపనార్థాలు పెట్టారు. ప్రజల నుంచి తీవ్రమైన నిరసనలు, వ్యతిరేకత ఎదురవ్వడంతో అధికారులు శుక్రవారం మధ్యహ్నం 1 గంట ప్రాంతంలో వెనుదిరిగారు. న్యూమారుతీనగర్ నార్త్ కాలనీతో పాటు ఇతర ప్రాంతాల్లో అధికారులు వేసిన మార్కింగ్‌లను ప్రజలు తొలగించడం కనపడింది.

నీకు రాజకీయ బిక్ష పెట్టిన రుణం ఈ విధంగా తీర్చుకుంటున్నావ రేవంత్

కొడంగల్‌లో ఎమ్మెల్యేగా ఓడిపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న నీకు రాజకీయ బిక్షపెట్టినందుకు ఎల్బీనగర్ ప్రజల మీద ఈ విధంగా కక్ష తీర్చుకుంటున్నావ రేవంత్ అంటూ ప్రజలు ప్రశ్నించారు. నీ బిడ్డను అంటూ వచ్చి మోసపూరిత మాటలతో మమ్మల్ని నమ్మించి ఎంపీగా గెలిచావు. అయ్యో పాపం అంటూ ఓట్లేసి గెలిపిస్తే ఇప్పుడు మా కడుపు మీద కొడుతున్నావంటూ మహిళలు రోదించారు. మా ఎల్బీనగర్ ప్రజల ఓట్లతోనే కదా నీవు గెలిచింది లేక పోతే నీవు ఎక్కడ ఉండేవాడివని యువకులు ప్రశ్నించారు. నీ ధన దాహం తీర్చుకునేందుకు పేద ప్రజలే దొరికారా అంటూ మహిళలు విలపించారు.

పోలీసులతో వాగ్వివాదం చేస్తున్న నిర్వాసితులు

న్యాయం జరిగే వరకూ అండగా ఉంటాం: మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల

పాత మలక్‌పేట డివిజన్‌లోని శంకర్‌నగర్‌లో పర్యటించి మూసీ రివర్ బెడ్ బాధితులతో మాట్లాడుతున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల

మలక్‌పేట, సెప్టెంబర్ 27: మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు న్యాయం జరిగే వరకు అన్ని విధాల అండగా ఉంటానని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల తెలిపారు. మలక్‌పేట నియోజకవర్గంలోని మూసానగర్, పాత మలక్‌పేట డివిజన్‌లోని శంకర్‌నగర్ ప్రాంతాల్లో మూసీ రివర్ బెడ్ పరిధిలోని అక్రమ నిర్మాణాలకు రెవెన్యూ శాఖ అధికారులు మార్కింగ్ చేసిన నేపథ్యంలో శుక్రవారం ఆయా ప్రాంతాల్లో ఆజంపురా కార్పొరేటర్ అబ్రార్, పాత మలక్‌పేట డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీతో కలిసి పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఒక్క భవనంలో నాలుగు కుటుంబాలు నివసిస్తున్నాయని, నలుగురికి కలిపి ఒకటే ఇల్లు ఇస్తాం అంటే ఎలాగని ప్రశ్నించారు. ఇక్కడ యాభై మందికి ఫోన్లు చేశారని, కానీ లిస్టులో 18 మంది పేర్లే ఉన్నాయని, తన వద్దకు పూర్తి లిస్టు వచ్చిన తర్వాత మాట్లాడతానని, ఎన్ని కుటుంబాలు ఉంటే అన్ని ఇండ్లు ఇవ్వాలని, లేకుంటే ఖాళీ చేసేదే లేదని ఎమ్మెల్యే అన్నారు. పునరావాసం కల్పించిన తర్వాతే తరలించటం జరుగుతుందని, ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

ప్రోస్టేట్ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్, వైద్యులు

మలక్‌పేట, సెప్టెంబర్ 27: ప్రతి ఏడుగురు పురుషుల్లో ఒకరు ప్రోస్టేట్ క్యాన్సర్ బారిన పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ప్రోస్టేట్ క్యాన్సర్ వ్యాధిపై పురుషులు అవగాహన పెంపొందించుకోవాలని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ(ఏఐఎన్‌యూ) ఫెసిలిటీ సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్ సూచించారు. సెప్టెంబర్ మాసాన్ని ప్రోస్టేట్ క్యాన్సర్ మాసంగా గుర్తించిన నేపథ్యంలో ప్రజల్లో అవగాహనను కల్పించేందుకు ఈనెల 29న ఆదివారం ఉదయం 6.30 గంటలకు ఏఐఎన్‌యూ దిల్‌సుఖ్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో 200 మందితో ప్రోస్టేట్ క్యాన్సర్‌పై అవేర్‌నెస్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వాక్‌లో గతంలో ఆస్పతిలో చికిత్స పొందిన రోగులతోపాటు వైద్యులు పాల్గొనున్నారని తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని ఏఐఎన్‌యూలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అవగాహన నడక కార్యక్రమానికి సంబంధించి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ యూరాలజిస్ట్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్, మహిళా యూరాలజిస్ట్ డాక్టర్ దీప్తి, డాక్టర్ వలీ, ఎనస్థీషియన్లు స్నిగ్ధె రామకృష్ణ, రఘునాథ్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌ఎండ్ పార్కు కాలనీ నూతన కార్యవర్గం

మన్సూరాబాద్, సెప్టెంబర్ 27: నాగోల్ డివిజన్ పరిధి సౌత్‌ఎండ్ పార్కు కాలనీ సంక్షేమ సంఘం భవనంలో శుక్రవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం. రమేశ్, ప్రధానకార్యదర్శిగా టి.రవికుమార్, ఉపాధ్యక్షుడిగా ఎంఎస్ మూర్తి, కోశాధికారిగా ఈ.రామకృష్ణ, సహాయ కోశాధికారిగా డి.సుధాకర్, సంయుక్త కార్యదర్శిగా వి.రాజేశ్‌రావు, కార్యవర్గ సభ్యులుగా సీహెచ్.హరిప్రసాద్, టి.జగన్మోహన్‌రావు, జి.కృష్ణారావు, ఇసుకపల్లి లక్ష్మినారాయణ, సీహెచ్.లక్ష్మయ్య, పిన్నింటి మమత, ఎస్.మురళి, జి.ప్రమీల, ఎస్‌వీ. సుబ్రహ్మణ్యం, జి.రమేశ్, కె.రామ్మోహన్ ఎన్నికయ్యారు.

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు అదృశం

నాగేశ్వర ప్రసాద్ (ఫైల్)

సైదాబాద్, సెప్టెంబర్ 27: వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమైన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మతిస్థిమితం సరిగా లేని పీవీఆర్.నాగేశ్వర ప్రసాద్ (60) 18ఏండ్లుగా సైదాబాద్ శంకేశ్వరబజార్‌లోని ఓల్డేజ్ హోంలో ఉంటున్నాడు. అయితే బుధవారం ఉదయం మార్నింగ్ వాక్‌కు సరూర్‌నగర్ చెరువు కట్టపైకి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఓల్డేజ్ హోం మేనేజర్ శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో...

వెంకటేశం గౌడ్ (ఫైల్)

మెదక్ జిల్లా సదాశివాపేట మండల పరిధిలోని మాచిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన కె.వెంకటేశం గౌడ్ (45) మేస్త్రి. ఈనెల 13న సైదాబాద్ సింగరేణికాలనీలో నివాసముండే తన సోదరి కళావతి వద్దకు వచ్చాడు. మరుసటి రోజు మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి సోదరి కళావతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, సంఘం ప్రతినిధులు

ఆర్కేపురం, సెప్టెంబర్ 27: నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి, స్వశక్తితో ఎదిగిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు కట్టపైన నూతనంగా ఏర్పాటు చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమం నుంచి, తెలంగాణ ఉద్యమం వరకు ఆయన చూపిన పోరాట పటిమ మరువలేనిదని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తారని చెప్పారు. పద్మశాలీ సంఘం ప్రతినిధులు అడిగిన విధంగా ఒక ఎకరం స్థలం కేటాయించేందుకు జిల్లా పరిధిలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. నావంతుగా కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు.

చింతలకుంటలోని ఎల్‌పీటీ మార్కెట్‌లో కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంఎంసీ అధ్యక్షుడు గంజి కిశోర్, ఎల్‌పీటీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గోర్ల అశోక్

– కాంగ్రెస్ పార్టీ ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేశ్‌నేత ఆధ్వర్యంలో బాపూజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, మధుసూదన్‌రావు, రవి కుమార్, రమేశ్‌నేత, పగిళ్ల భూపాల్‌రెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్, శివ, యాదవరెడ్డి, మహేందర్, జగన్నాథం, సూర్యకాంతం, నరసింహ, ప్రసాద్, కల్యాణ్, సైదులు ఉన్నారు.

– మన్సూరాబాద్, సెప్టెంబర్ 27: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కొండా లక్ష్మణ్‌బాపూజీ పాత్ర మరువులేనిదని ఎల్‌పీటీ మార్కెట్ మర్చంట్ కమిటీ అధ్యక్షుడు గంజి కిశోర్ అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి చింతలకుంటలోని ఎల్‌పీటీ మార్కెట్‌లో మార్కెట్ మర్చంట్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి నిర్వహించారు. ఎంఎంసీ అధ్యక్షుడు గంజి కిశోర్, ఎల్‌పీటీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గోర్ల అశోక్ ముఖ్య అతిథులుగా హాజరై కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శ్రీధర్, నామని నర్సింహ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

– హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్‌లోని షిర్డీ సాయిబాబా దేవాలయం వద్ద ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, మన్సురాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పాల్గొని బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొండా బాపూజీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న దేప భాస్కర్‌రెడ్డి, పున్న గణేశ్‌నేత

హయత్‌నగర్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి

వైకల్యంతో జీవించే పిల్లల హక్కుల పరిరక్షణపై ఢిల్లీలో సెమినార్

సైదాబాద్, సెప్టెంబర్ 27 : సుప్రీంకోర్టు ఆడిటోరియంలో ''వైకల్యంతో జీవించే పిల్లల హక్కులను పరిరక్షించడం–వికలాంగుల విభజన'' (సీఐసీఎల్–సీఎన్‌సీపీ)పై నేడు, రేపు (శని, ఆదివారం) రెండు రోజుల పాటు జరిగే జాతీయ వార్షిక వాటాదారుల సంప్రదింపుల సెమినార్‌కు తెలంగాణ రాష్ట్ర మహిళా, శిశు వికాలంగుల సీనియర్ సిటిజన్స్ సెక్రటరీ వాకటి కరుణ, జువైనల్ వెల్ఫేర్ కరేక్షనల్ సర్వీసెస్ తరుపున డిప్యూటీ డైరెక్టర్ మిర్జా రజాక్ బేగ్ హాజరు కానున్నారు. ఈ మేరకు జువైనల్ జస్టిస్ కమిటీ సుప్రీం కోర్టు ఆఫ్ ఇండియా నుంచి తెలంగాణ రాష్ట్రానికి హైకోర్టు జువైనల్ జస్టిస్ కమిటీకి ఆహ్వానం అందింది. సుప్రీంకోర్టు ఆడిటోరియం, ఆడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ కంప్లెక్స్‌లో యునిసెఫ్–ఇండియాతో కలిసి జరిగే జాతీయ సెమినార్‌కు సైదాబాద్‌లోని జువైనల్ వెల్ఫేర్ కరేక్షనల్ సర్వీస్ డిపార్టుమెంట్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మిర్జా రజాక్ బేగ్ పాల్గొంటున్నారు.

పర్యావరణ పరిరక్షణలో ఉద్యోగులు భాగస్వాములు కావాలి

బండ్లగూడలోని సౌథెర్న్ రీజియన్ జీఎస్ఐ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న సంస్థ ఏడీజీ సూరజ్ దోమజీ పట్‌బాజి తదితరులు

మన్సూరాబాద్, సెప్టెంబర్ 27: పర్యావరణ పరిరక్షణలో ఉద్యోగులు భాగస్వాములు కావాలని జీఎస్ఐ ఏడీజీ, హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ సూరజ్ దోమజీ పట్‌బాజి తెలిపారు. స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా ఏక్ పేడ్ మాకే నామ్ పేరుతో బండ్లగూడలోని సౌథెర్న్ రీజియన్ జీఎస్ఐ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగులతో కలిసి ఆయన మొక్కలను నాటారు. అనంతరం కార్యాలయం ప్రాంగణంలోని చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఎస్ఐ సంస్థలో పని చేస్తున్న ప్రతి ఉద్యోగి కార్యాలయం ప్రాంగణంలో ఒక మొక్కను నాటాలని సూచించారు. నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ఉద్యోగులదేనని తెలిపారు. జీఎస్ఐ సంస్థ డైరెక్టర్, హెడ్ ఆఫ్ ఆఫీస్ హార్మోహన్ మిషరా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీడీజీలు ఎస్ఎన్ పాత్ర, అన్నుమన్ ఆచార్య, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్ ఎస్. శంకరయ్య, స్టోర్స్ ఆఫీసర్ ఆదర్ల మహేశ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మధిర సత్యనారాయణ, జాయింట్ డైరెక్టర్ ఎస్. తారకేశ్వరరావు, అధికారులు వీవీఎస్ శర్మ, దివాకర్‌రెడ్డి, కె. నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు విద్యార్థుల్లో క్రీడాసక్తిని పెంపొందిస్తాయి

విజేతలకు బహుమతులను ప్రదానం చేసిన కార్పొరేటర్, డిప్యూటీ ఈవో రాధాకృష్ణ

మలక్‌పేట, సెప్టెంబర్ 27: క్రీడాపోటీలు విద్యార్థుల్లో క్రీడాసక్తిని పెంపొందిస్తాయని మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. 68వ హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(హెచ్‌డీఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 25న నిర్వహించిన అండర్ 14, 17 బాయ్స్ అండ్ గర్ల్స్ ఇంటర్ సైదాబాద్ జోన్ లెవెల్ స్కూల్ కబడ్డీ, ఖోఖో టోర్నమెంట్ పోటీల్లో విజేతలకు శుక్రవారం సలీంనగర్‌లోని స్వామి వివేకానంద సెంటినరీ హైస్కూల్‌లో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో రాధాకృష్ణ, స్వామి వివేకానంద పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రేటరీ ఓం హరికృష్ణ, సీనియర్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ సునీల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.